నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 10 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి ● ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

● బెజ్జూర్, చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ల తనిఖీ

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్ కుమార్

బెజ్జూర్/చింతలమానేపల్లి, ఏప్రిల్ 9 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం బెజ్జూర్, చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాధిక్ పాషా, ఎస్ఐలు నరేశ్, విక్రమ్, సిబ్బంది ఉన్నారు.

అడవిలో అగ్నిప్రమాదం

మంటలార్పిన సిబ్బంది

మంటలు ఆర్పుతున్న అటవీశాఖ అధికారులు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 9: లక్షెట్టిపేట రేంజ్ పరిధిలోని కొర్విచల్మ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఎండలు మండడంతో అడవిలో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన వెళ్లి మంటలు ఆర్పివేశారు. చాకచక్యంగా స్పందించిన లక్షెట్టిపేట డిప్యూటీ రేంజ్ అధికారి హజార్‌తో పాటు సిబ్బంది అత్తె సత్తయ్య, రవినాయక్, చంద్రశేఖర్, సుమలత, ముజ్జు, ఖలీంలను ఉన్నతాధికారులు అభినందించారు.

జన్నారం మండలం మందపెల్లిలో ఎండుతున్న వరిపంటను చూపుతున్న రైతు

కండ్లముందే వరి ఎండే..

● జన్నారం మండలంలో ఎండుతున్న పొలాలు ● అందని కడెం ప్రాజెక్టు నీరు ● కొత్తగా బావులు తవ్వినా ఫలితం శూన్యం

● పొట్ట దశలో చేతికందకుండా పోతున్న వరి ● అన్నదాతలకు తీవ్ర నష్టం ● సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

జన్నారం, ఏప్రిల్ 9 : ఎన్నో ఆశలతో వరి సాగు చేసిన రైతాంగానికి నిరాశే ఎదురైంది. భూగర్భ జలాలు అడుగంటి.. పంట చేతికొచ్చే దశలో కండ్లముందే ఎండిపోతుండగా గుండెలు బాదుకుంటున్నది. జన్నారం మండలంలో గతేడాది యాసంగిలో 9,528 ఎకరాల్లో వరి వేయగా, ఈ యేడాది 7,028 ఎకరాల్లో సాగు చేశారు. కేసీఆర్ సర్కారు హయాంలో కడెం ప్రాజెక్టు నుంచి విడుతల వారీగా నీటిని విడుదల చేయగా, రంది లేకుంట పంటలు తీశారు. కానీ, ప్రస్తుతం కడెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయకపోవడంతో రేండ్లగూడ, పొనకల్, తిమ్మాపూర్, కవ్వాల్ ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బావుల్లో పూడిక తీసినా ఫలితం లేకుండా పోతున్నది. కొందరైతే కొత్తగా బావులు తవ్వుకున్నా నీరు పడడం లేదు. పొట్ట దశలో పంటలు ఎండిపోతుండడాన్ని చూసి రైతులు గుండెలు బాధుకుంటున్నారు. కేసీఆర్ సర్కారులో ఎండాకాలం వస్తుందంటే ముందుస్తుగానే కాలువలు, చెరువుల్లోకి నీటిని విడుదల చేసేవారని, దీంతో సాగు, తాగు నీటికి ఢోకా లేకుండెనని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టింపులేని తనంతో తామంతా తీవ్రంగా నష్టపోయే దుస్థితి వచ్చిందని, ఇకనైనా తమకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



అడుగంటిన బావి

నీరులేక ఎండిపోయిన డీ-13 కాలువ

కేసీఆర్ సర్కారులో ఢోకా లేకుండె

కేసీఆర్ సర్కారులో ఎప్పుడూ పంటలు ఎండిపోయింది లేదు. ఢోకా లేకుంట రెండు పంటలు తీసినం. ఈ యాసంగిలో నాకున్న పదెకరాల్లో వరి వేసిన. రూ. లక్ష దాకా పెట్టుబడి అయ్యింది. వరి పొట్టకొచ్చే సమయంలో నీళ్లు లేకుంటైనయి. రూ. 50 వేలు పెట్టి బావిలో పూడిక తీసిన. అయినా నీళ్లు పడలేదు. పదెకరాల పంట ఎండిపోతున్నది. కాంగ్రెస్ సర్కారే పరిహారం ఇచ్చి మమ్ముల ఆదుకోవాలె.

- అల్ల నరేష్, రేండ్లగూడ, జన్నారం

కొత్త బావి తవ్వితే బండ వచ్చింది

మా ఊరిలో నాకు మూడెకరాల పొలం ఉంది. ఇందులో ఎకరంన్నరలో వరి వేసిన. ఇంకొన్ని రోజులైతే పంట కోసేటోళ్లం. ఇంతలోనే బావిలో నీళ్లు లేకుంటైనయి. రూ. 40 వేలు పెట్టి పూడిక తీయించిన. అయినా ఫలితం లేకుండే. అందుకే మళ్లో రూ. లక్ష పెట్టి కొత్త బావి తవ్వించిన. అందులో బండ వచ్చింది. ఏం చేయాలో దిక్కు తోచుత లేదు. పంట మొత్తం ఎండిపోతంది. సర్కారు ఆదుకోవాలె..

- కొలిపాక సత్తన్న, మందపెల్లి, జన్నారం

నీటి తిప్పలు తప్పవా..!?

ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

● ప్రస్తుతమున్నది 7.35 టీఎంసీలే.. ● వేసవి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై అనుమానాలు

● పంటలకు నీరిస్తే.. తాగు నీటికి గోసే.. ● ఇప్పుడున్న వాటర్ తాగు నీటికే వాడాలంటూ సర్కారు ఆదేశాలు

● గూడెంలిఫ్ట్ నుంచి సాగు నీరు బంద్.. పొలాలు ఎండిపోయే ప్రమాదం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో తగ్గిన నీటిమట్టం

ప్రాజెక్ట్‌లోని ఇన్‌టెక్‌వెల్ దగ్గర కనిపించని నీరు

మంచిర్యాల, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా వాసులు, రైతులకు ఈ వేసవిలో నీటి తిప్పలు తప్పేలా లేవు. ప్రధాన కల్పతరువులా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులో రోజురోజుకూ నీటి నిల్వలు పడిపోతుండగా, పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగు నీటికి ఉపయోగిస్తే.. తాగు నీటికి.. తాగు నీటికి ఉపయోగిస్తే సాగు నీటికి తిప్పలు తప్పేలా లేవు.

ప్రస్తుతమున్నది 7.35 టీఎంసీలే..

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కెపాసిటీ 20.175 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి 7.35 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ మొత్తం నీరు తాగునీటికే సరిపోయేలా ఉంది. అందుకే కేవలం తాగునీటి అవసరాలకే వాడుకోవాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ స్కీమ్‌కు 308 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అలాగే మిషన్‌భగీరథ స్కీమ్ కింద రామగుండం గ్రిడ్‌కు 58 క్యూసెక్కులు, మంచిర్యాల గ్రిడ్‌కు 23 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి కోసమే ఉపయోగిస్తే అతికష్టం మీద జూన్ మొదటి వారం దాకా వెళ్లదీయవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే, సాధ్యాసాధ్యలపై మాత్రం స్పష్టత కొరవడింది. ఇప్పటికే ప్రాజెక్టులోని ఇన్‌టెక్‌వెల్ దగ్గర నీటి నిల్వలు అడుగంటాయి. దీంతో నీరు ఉన్న దగ్గరి నుంచి ఒక కెనాల్ తీసి ప్రస్తుతానికి ఇన్‌టెక్‌వెల్‌కు నీటి సరఫరా చేస్తున్నారు. ఒకవేళ డెడ్‌స్టోరేజీకి చేరువైతే ప్రాజెక్ట్ మధ్యలో తాత్కాలిక పంపులు ఏర్పాటు చేసైనా సరే తాగునీరు సరఫరా చేస్తామని భగీరథ అధికారులు పేర్కొంటున్నారు

జిల్లాలోని 330 గ్రామాలకు ఇదే దిక్కు..

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 330 గ్రామ పంచాయతీలు, మరో 20 తండాలు, గూడేలకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మిషన్ భగీరథ గ్రిడ్ నుంచే తాగునీరు సరఫరా అవుతుంది. జిల్లాలో ప్రతి రోజూ 6.75 ఎంఎల్‌డీ నీరు అంటే 0.09 టీఎంసీలు తాగడానికి కావాల్సి ఉంటుంది. గతేడాది రుతుపవనాలు ఆలస్యమైనప్పుడు ఎల్లంపల్లి ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు ఉంది. కానీ, అప్పుడు కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టును నింపుకునే అవకాశం ఉండగా సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. కాళేశ్వరంలో ఎత్తిపోస్తే ఎల్లంపల్లి మొత్తం నిండిపోయేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. సాగునీటి నిర్వహణలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయకపోవడంతో ఎల్లంపల్లి ఎండాల్సిన దుస్థితి వచ్చింది. గతేడాది ఇదే సమయానికి బెడ్ లెవల్ 145 అడుగుల నీటితో నిండుకుండను తలపించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు.. ఇప్పుడు డెడ్‌స్టోరేజీకి దగ్గరయ్యింది. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే మాత్రం రెండు నెలల్లో ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడక తప్పదు.

గూడెంలిఫ్ట్‌ను నడిపిస్తే కష్టమే..

కడెం ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి 3 టీఎంసీలు నీళ్లు ఇవ్వాలనేది నిబంధన. దీని కింద దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాకపోతే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో 18 టీఎంసీల నీరు ఉంటేనే గూడెం లిఫ్ట్‌ను నడపాలి. కానీ ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లోనే ప్రాజెక్ట్‌లో నీరు 18 టీఎంసీల కంటే దిగువకు చేరింది. కానీ స్థానిక రైతుల డిమాండ్ మేరకు 15వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీరు ఇస్తున్నారు. ఈ మేరకు మొన్నటి దాకా గూడెం లిఫ్ట్ నుంచి నీరు సరఫరా చేసిన అధికారులు... మొన్నీ మధ్యే నీటి సరఫరాను ఆపారు. మూడు రోజుల పాటు నీటి విడుదలను ఆపడంతో చివరి దశలో ఉన్న వరి పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో ఆదివారం రాత్రి నుంచి నీటిని తిరిగి వదులుతున్నారు. ఒక తడికి నీరు ఇచ్చేందుకు ఈ నెల 9వ తేదీ(మంగళవారం) సాగునీటిని వదలనున్నారు. కాగా, దీంతో కొద్ది మంది రైతులకే మేలు జరుగుతుందని, ఇంకా నీరు అవసరం ఉన్న పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు కిందున్న రైతులు చెబుతున్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు గూడెంలిఫ్ట్‌ను నడిపిస్తే మాత్రం మంచిర్యాలకు తాగునీరు ఇవ్వడం కష్టమని ఇరిగేషన్, భగీరథ అధికారులు చెబుతున్నారు.

జూన్ దాకా ఇబ్బంది లేదు

ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి నిల్వలతో జూన్ మొదటి వారం దాకా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తాగునీరు ఇవ్వొచ్చు. గూడెం లిఫ్ట్ నుంచి పంటలకు నీరు ఇవ్వడం ఆగిపోతే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒకవేళ ఇవ్వాల్సి వచ్చి ఎల్లంపల్లి డెడ్‌స్టోరేజీకి చేరితే ప్రాజెక్ట్ మధ్యలో తాత్కాలిక పంప్‌లు ఏర్పాటు చేసైనా సరే మిషన్ భగీరథకు నీరు ఇస్తాం. హైదరాబాద్ మెట్రో వాటర్ స్లపయ్‌కు, ఎన్టీపీసీకి, రామగుండ భగీరథ గ్రిడ్‌కు రోజూ ఇవ్వాల్సినన్ని నీరు ఇచ్చినా మంచిర్యాలకు ఇబ్బంది ఉండదు.

- కృష్ణ, మిషన్ భగీరథ డీఈఈ

నిర్లక్ష్యపు అధికారులపై కొరడా

● 'ఉపాధి' పనుల కల్పనలో అలసత్వంపై అదనపు కలెక్టర్ సీరియస్ ● 12 మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు

● 48 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

ఇటీవల వాంకిడి మండం బెండారలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవోలు, ఏపీవోలపై అదనపు కలెక్టర్ దీపక్ తివారీ కొరడా ఝుళిపించారు. ఈ మేరకు సోమవారం రాత్రి 12 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, 48 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

పనులు కల్పించడంలో నిర్లక్ష్యం..

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 335 గ్రామ పంచాయతీలు ఉండగా, 1.23 లక్షల జాబ్‌కార్డులు, 2.46 లక్షల మంది కూలీలు ఉన్నారు. కానీ యాక్టివ్ జాబ్‌కార్డులు 88 వేలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కూలీల సంఖ్య 1.65 లక్షలు మాత్రమే. దాదాపు 81 వేల మంది ఉపాధి పనులు చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ పనులు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4,134 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పనులు కల్పించగలిగారు. పనిచేసే కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించని కారణంగా కూలీలు పనులు చేసేందుకు రావడం లేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వాంకిడి మండలం బెండార గ్రామ పంచాయతీలో ఉపాధి పనులను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ స్వయంగా పరిశీలించారు. పని ప్రదేశాల్లో కనీస వసతులైన నీడ, నీరువంటి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. 1.65 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా పనులు చేస్తున్నట్లు అధికారులు చెబుతుండగా, ఇందులో కేవలం 4,134 మందికి మాత్రమే 100 రోజుల పని కల్పించగలిగారు. ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో 13,959 మంది కూలీలు పని చేసేవారు ఉంటే, కేవలం 433 కుటుంబాలకు మాత్రమే 100రోజుల పని కల్పించారు. బెజ్జూర్ మండలంలో 12,595 మంది కూలీలుంటే, వీరిలో 158, చింతలమానేపల్లి మండలంలో 10,972 మంది ఉంటే, కేవలం 78 మంది, జైనూర్ మండలంలో 12,127 మంది ఉంటే, 145 మంది, కాగజ్‌నగర్‌లో 12,675 మంది కూలీలుంటే, వీరిలో 421 మంది, కెరమెరి మండలంలో 13,409 మంది ఉంటే, 209 మంది, లింగాపూర్ మండలంలో 7,815 మంది కూలీలుంటే, 184 మంది, రెబ్బెన మండలంలో 11,845 మంది కూలీలుంటే, 192 మంది, సిర్పూర్-టీలో 7,680 మంది కూలీలుంటే 199 మంది, సిర్పూర్-యు మండలంలలో 7,366 మంది కూలీలుంటే, 122 మంది, తిర్యాణి మండలంలో 9,546 మంది ఉంటే 68 మంది, వాంకిడి మండలంలో 11,075 మంది కూలీలుంటే, 443 మందికి మాత్రమే 100 రోజుల పనిదినాలు కల్పించగలిగారు.

క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి..

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి రోజూ 200 మంది కూలీలకు పనులు కల్పించాలి. కానీ, అధికారులు, సిబ్బంది కూలీలకు కావాల్సిన విధంగా పనులు కల్పించడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో మాత్రమే కూలీలకు సరైన విధంగా పనులు కల్పిస్తున్నట్లు గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లింగాపూర్, సిర్పూర్-యు, వాంకిడి, కెరమెరి, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్-టీ, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల ఎంపీడీవోలు, ఈజీఎస్ ఏపీవోలకు సోమవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సక్కును గెలిపించాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ ● పెంచికల్‌పేట్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

పెంచికల్‌పేట్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండె విట్టల్

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 9 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే సాగు, తాగు నీటి కష్టాలు కళ్లముందు కనబడుతున్నాయన్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్ గళం విప్పాలంటే, ఉమ్మడి జిల్లా సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు గెలవాలని పేర్కొన్నారు. దేశంలోనే రైతన్నను ఆదుకున్న ఏకైక సర్కారు బీఆర్ఎస్ అని కొనియాడారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మెడలు వంచాలంటే కేసీఆర్ తోనే సాధ్యమవుతుందని, రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు సాధించుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం ఇటీవల ఏనుగు దాడిలో మరణించిన కొండపల్లి గ్రామానికి చెందిన రైతు కారు పోశన్న కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరపున సహకారం అందిస్తామన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొట్లగూడలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నౌనురి శ్రీనివాస్,బిట్టు శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, ఎల్కరి సుధాకర్, కొల్లిపాక శ్రీనివాస్,పాగిడే ఆశన్న, శ్రీనివాస్ గోపాల్ పాల్గొన్నారు.

గర్భిణి, శిశువు మృతి

జైనూర్ ఏప్రిల్ 9 : దుబ్బగూడ పంచాయతీలోని లక్ష్మణ్‌పటేల్‌గూడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి ఆత్రం లక్ష్మి (30) దగ్గు, దమ్ముతో మంగళవారం మృతి చెందింది. లక్ష్మికి దగ్గు, దమ్ము అధికం కావడంతో మంగళవారం జైనూర్ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం 108లో ఉట్నూర్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో ఒకేసారి దగ్గు, దమ్ము రావడంతో ఆకస్మాత్తుగా మృతి చెందింది. ఆత్రం లక్ష్మికి మొదటి కాన్పులో శిశువు మరణించింది. రెండో కాన్పులో తల్లితో పాటు గర్భంలోనున్న శిశువు కూడా మృత్యువాత పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉగాది పండుగ రోజు తల్లీబిడ్డ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, గ్రామ పటేల్ లక్ష్మణ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.

తాగు నీరందించాలి

నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

కెరమెరి, ఏప్రిల్ 9 : పల్లెల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో అనిల్ కుమార్ సూచించారు. కెరమెరి మండల ప్రత్యేకాధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జోడెఘాట్ గ్రామాన్ని సందర్శించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోడెఘాట్ గ్రామంలో నిత్యం తాగు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో, సూపరింటెండెంట్ సుధాకర్ ఉన్నారు.

ఎండకు తాళ లేక చెట్టు నీడకు..

భానుడు ఉగ్రరూపం దాల్చాడు. రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండగా, ప్రజలేకాక మూగజీవాలు సైతం అల్లాడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడలో మూగజీవాలన్నీ.. ఇలా చెట్టు నీడన చేరి సేదతీరుతుండగా, 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పెంచికల్ పేట మండలం బొంబాయిగూడ గ్రామ శివారులో చెట్టు నీడన సేద తీరుతున్న ఆవులు